సాక్షి వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 11 । మే । 2023



రక్తమోడిన రహదారులు

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదాలతో రహదారులు రక్తమోడాయి. వేర్వేరు సంఘటనల్లో నలుగురు మృతి చెందారు. - 8లో



ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నేపథ్యంలో వైఎస్సార్ జిల్లా పోలీసులు ముగ్గురు క్రికెట్ బుకీలను అరెస్టు చేశారు. - 8లో



జనసంద్రం..రథోత్సవం

వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు పట్టణంలో శ్రీనారాపుర వెంకటేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. - 8లో

ఆసుపత్రే..ఆఖరి మజిలీ!

- చివరి రోజుల్లో అయిన వారి ఆదరణకు నోచుకోని వారెందరో
- జిల్లా ఆస్పత్రిలో రోజురోజుకు పెరుగుతున్న గుర్తు తెలియని వ్యక్తుల మరణాలు
- ఆచూకీ తెలుసుకునేందుకు ఇబ్బంది పడుతున్న పోలీసులు
- ఎవరూ రాకపోవడంతో మున్సిపల్ సిబ్బందిచే అంతిమ సంస్కారాలు



ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి (ఇన్‌సెట్) ఆస్పత్రిలో మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు (ఫైల్)

ఐదు నెలల్లో ఆస్పత్రిలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తులు

నెల	మరణాలు
డిసెంబర్ (2022)	7
జనవరి	5
ఫిబ్రవరి	6
మార్చి	7
ఏప్రిల్	6



ప్రొద్దుటూరు క్రైం: పెద్దగా ఆస్తిపాస్తులు, సౌకర్యాలు లేని రోజుల్లోనే మనుషుల మధ్య అనుబంధాలు, ఆప్యాయతలు చక్కగా ఉండేవి. నాడు కుటుంబానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చేవారు. కష్టానికి.. సుఖానికి ఒకరికొకరు కలుసుకుంటూ ఉండటంతో అందరం దగ్గరి వాళ్లమనే అనుభూతి ఉండేది. వృద్ధాప్యంలో ఉన్న అవ్వా, తాతలకు దగ్గరుండి సపర్యలు చేసేవారు. అయిన వాళ్ల మధ్యనే వారి చివరి రోజులు సుఖంగా గడిచేవి. అయితే ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పట్టణాలు, పల్లెలనే తేడా లేకుండా ప్రేమాభిమానాలు, బంధం, నైతిక విలువలు చాలా కుటుంబాల్లో కరువయ్యాయి. అందరూ ఉన్నదాంట్లోనే బాగా సంతృప్తిగా జీవించాలని భావిస్తారు. తమ చివరి మజిలీ సొంత మనుషుల మధ్య సాఫీగా సాగిపోవాలని భగవంతున్ని కోరుకుంటారు. కారల్ మార్క్స్ ఏనాడో చెప్పినట్లుగా ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలన్నీ ఆర్థిక చట్రంలో ఇరుక్కుపోయాయి. ధనిక, పేద అనే తేడా లేకుండా చాలా మంది వృద్ధులు కుటుంబ ఆదరణకు దూరం అవుతున్నారు. వారి రోజు వారి పనులు స్వతహాగా చేసుకునే వరకు వృద్ధులను కొద్దో గొప్పో చూసుకుంటున్నారు. అనారోగ్యంతో, నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులను కొందరు ఆస్పత్రుల్లో వదిలి వెళ్లిన ఘటనలు ఇటీవల అనేకం వెలుగు చూస్తున్నాయి. దీంతో అందరూ ఉన్నా చివరి రోజుల్లో ఒంటరై అనారోగ్యంతో ఆస్పత్రిలోనే అనేక మంది తనువు చాలిస్తున్నారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో ఇలాంటి ఘటనలు ఇటీవల కాలంలో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. వీరిలో వృద్ధులు, మతిస్థిమితం కోల్పోయిన వారు ఉన్నారు.

అధికమవుతున్న గుర్తు తెలియని వ్యక్తుల మరణాలు

ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో కొంత కాలం నుంచి గుర్తు తెలియని వృద్ధులు, వ్యాధుల బారిన పడిన వ్యక్తుల మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నెలలో కనీసం ఐదారు మంది అనారోగ్యం పాలై జిల్లా ఆస్పత్రిలో చేరుతున్నారు. మరణించిన వారి వివరాలు తెలియకపోవడంతో పోలీసులతో పాటు వైద్యాధికారులు, మున్సిపల్ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. స్వతహాగా ఆస్పత్రికి వచ్చే వృద్ధులు, అనారోగ్య బాధితులు కొందరైతే.. ఇంకొందరినేమో కుటుంబ సభ్యులే ఆస్పత్రిలో వదిలి వెళ్తున్నారు. ఆస్పత్రిలో అడ్మిషన్‌లో ఉండే రోగులకు తోడుగా తప్పకుండా సహాయకులు ఉండాలి. సహాయకులు లేకుంటే ఆస్పత్రి సిబ్బంది అభ్యంతరం చెబుతారు. ఈ కారణంతో కొందరు వృద్ధులను ఆస్పత్రికి తీసుకెళ్లి వార్డులో అడ్మిట్ చేసిన తర్వాత ఒకటి, రెండు రోజులుండి అక్కడి నుంచి పత్తా లేకుండా వెళ్లిపోతున్నారు. ఆధార్ కార్డు ఆధారంగా అడ్రస్ రాయించినా సెల్‌నంబర్ తప్పుగా ఇస్తున్నారని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. ఇలా ఆస్పత్రిలో చేరిన వారు కోలుకుంటే ఎలాగోలా వాళ్లే ఇళ్లకు వెళ్లిపోతారని, మృతి చెందితే వారి మృతదేహాలను ఒకటి, రెండు రోజుల పాటు మార్చురీలోని ఫ్రీజర్ బాక్స్‌లో భద్రపరుస్తామని వారంటున్నారు. తగిన వివరాలు, సెల్ నంబర్ లేని కారణంగా మృతి చెందిన వారి వివరాలను కుటుంబ సభ్యులకు తెలుపలేకపోతున్నామని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. వీరిలో వృద్ధులు, మతిస్థిమితం లేని వారి కంటే కుటుంబ సభ్యులు ఉన్న వాళ్లే ఎక్కువగా ఉన్నట్లు ఆస్పత్రి రికార్డుల ఆధారంగా తెలుస్తోంది.

అనాథలుగా భావించి అంత్యక్రియలు

ఆస్పత్రి అడ్మిషన్ రిజిస్టర్‌లో ఉన్న వివరాల ప్రకారం మృతి చెందిన వారి వివరాలను సిబ్బంది కనుగొనే ప్రయత్నం చేస్తుంటారు. మృతి చెందిన వారి వివరాలను ఆస్పత్రిలోని ఔట్ పోస్టు పోలీసులకు కూడా సమాచారం ఇస్తారు. వారి వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా పోలీసులు ఆయా గ్రామాలకు ఫోన్ చేసి బంధువులకు సమాచారం ఇచ్చే ప్రయత్నం చేస్తారు. ఒక వేళ మృతి చెందినవారు అనాథలైతే మీడియాకు సమాచారం అందించి వారి ఫొటోలను పత్రికల్లో ప్రచురిస్తారు. మృతదేహం కోసం ఎవరూ రాకుంటే మున్సిపల్ సిబ్బంది సహకారంతో స్థానికంగానే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఏడాదిలో 60 మందికి పైగా అనారోగ్యంతో ఉన్న వారు, వృద్ధులు చికిత్స పొందుతూ జిల్లా ఆస్పత్రిలో మరణిస్తున్నారు.

ఆస్పత్రిలో వదిలి వెళ్తే కేసులు



రక్త సంబంధీకులు ఎవరైనా వృద్ధులను, మతి స్థిమితం లేని వారిని ఒంటరిగా జిల్లా ఆస్పత్రిలో వదిలి వెళ్తే కేసులు నమోదు చేస్తాం. ఆస్పత్రిలో కుటుంబ సభ్యులే దగ్గరుండి వారి సంరక్షణ చర్యలు చూసుకోవాలి. అలా కాకుండా ఆస్పత్రిలోని వార్డులో వదిలి వెళ్తే వారి వివరాలు సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. దయచేసి అనారోగ్యంతో ఉన్న వృద్ధులను ఆదరించండి. మనం కూడా వారిలాగే వృద్ధుల వుతామనే సత్యాన్ని గ్రహించండి. – ఇబ్రహీం, టూటౌన్ సీఐ, ప్రొద్దుటూరు

తప్పకుండా సంరక్షకులు ఉండాలి



అనారోగ్యంతో ఉన్న వారిని ఆస్పత్రిలో చేర్పించాలంటే వారి వెంట తప్పకుండా ఎవరో ఒకరు సహాయకులు ఉండాలి. స్వతహాగా వారి పనులు చేసుకునే వారైతే పరవాలేదు. తీవ్ర అనారోగ్యంతో ఉంటే సపర్యలు చేయడానికి కుటుంబ సభ్యులు తోడు ఉండాలి. ఆస్పత్రిలో మృతి చెందిన వారి వివరాలు తెలియకుంటే రెండు రోజుల పాటు మృతదేహాలను మార్చురీలో భద్రపరచి తర్వాత మున్సిపల్ సిబ్బందికి అప్పగిస్తున్నాం.
– డాక్టర్ ఆనంద్‌బాబు, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, ప్రొద్దుటూరు

ప్రశాంతంగా పాలిసెట్ పరీక్ష

- 23 పరీక్షా కేంద్రాల్లో 7224 మంది విద్యార్థులు హాజరు
- 91.29 శాతం హాజరు నమోదు



కడపలోని పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించిన పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులంతా నిర్ణీత సమయంలోపే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలోని 23 పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన ఈ పాలిసెట్ పరీక్షకు 7913 మంది విద్యార్థులకు గాను 7224 మంది హాజరయ్యారు. దీంతో 91.29 హాజరు శాతం నమోదైంది. ఇందులో కడపలోని 13 పరీక్షా కేంద్రాల్లో 3845 మందికి 3474 మంది హాజరు కాగా, ప్రొద్దుటూరులోని 10 పరీక్షా కేంద్రాల్లో 4068 మందికి 3750 మంది హాజరయ్యారు. కలెక్టర్ విజయరామరాజు కడపలోని ఆర్ట్స్ కాలేజీని, పాలిసెట్ పరీక్షల జిల్లా కో ఆర్డినేటర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, పాలిసెట్ పరీక్షల కడప స్పెషల్ అబ్జర్వర్ లలిత, పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ సిహెచ్ జ్యోతి జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

అంగన్వాడీలు మెరుగైన సేవలు అందించాలి

- డీఆర్వో గంగాధర్‌గౌడ్



కడప సెవెన్‌రోడ్స్ : అంగన్వాడీలు మరింత మెరుగైన సేవలు అందించాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ కోరారు. బుధవారం కలెక్టరేట్ స్పందన హాలులో జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారితశాఖ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు, బాలలకు అందుతున్న సేవలపై సమీక్షించారు. ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ నమోదు చేసే ప్రతి గర్భిణికి సేవలు అందించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ రాణి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ'

కడప కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈనెల 11వ తేది గురువారం 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు రమణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఉదయం 11 నుంచి 12 గంటలలోపు 08562–242457 నంబర్‌కు ఫోన్ చేసి, తమ సమస్యలను తెలిపి పరిష్కారాలు పొందవచ్చన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: జాతీయ న్యాయసేవాధికారసంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వ ర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడుతుందని, మరింత సమాచారం కోసం 08562 258622, 244622 నంబర్లలో, డిస్ట్రిక్ట్.ఈకోర్ట్స్.జీఓవి.ఐఎన్/కడప, డీఎల్ఎస్ఏకేడీపీఏట్‌దిరేటాఫ్‌జీమెయిల్.కామ్ లో పరిశీలించాలని.. జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ ఎం.ప్రదీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

బాధ్యతలు చేపట్టిన మెప్మా పీడీ



మెప్మా పీడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న వై. సురేష్‌రెడ్డి

కడప కార్పొరేషన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్(పూర్తి అదనపు బాధ్యతలు)గా వై. సురేష్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పీడీగా ఉన్న రామమోహన్‌రెడ్డి మంగళవారం రిలీవ్ అయ్యారు. కొత్త పీడీగా నియమితులైన సురేష్ రెడ్డి ట్రెజరీ శాఖలో గ్రూప్–1 ఆఫీసర్‌గా పనిచేస్తూ మెప్మా ఏఓగా డిప్యూటేషన్‌పై వచ్చారు. ప్రస్తుతం పూర్తి అదనపు బాధ్యతలతో ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. వైఎస్సార్ జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గం, పెద్దముడియం మండలంలోని జె. కొట్టాలపల్లె ఆయన స్వగ్రామం. ఇకపై వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల బాధ్యతలు ఆయనే చూడనున్నారు.

రేపు బేస్‌బాల్ జట్టు ఎంపిక

పులివెందుల టౌన్: పట్టణంలోని ధ్యాన్‌చంద్ క్రీడా మైదానంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు బేస్‌బాల్ సీనియర్స్ పురుషుల జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు బేస్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి బి.రామకృష్ణారెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎంపికల్లో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు, టెన్త్ మార్క్‌లిస్ట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు అనంతపురంలో ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

మొదటి సోమవారం ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్

కడప సెవెన్‌రోడ్స్: ప్రతినెల మొదటి సోమవారం ఉదయం 10.00 నుంచి 11.00 గంటల వరకు ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ నిర్ణయించారని డీఆర్వో గంగాధర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 21న జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కొందరు సభ్యులు ఈ విషయాన్ని ప్రస్తావించారని పేర్కొన్నారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. డివిజన్, మండల స్థాయిలో కూడా ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా గ్రీవెన్స్‌సెల్ నిర్వహించి అర్జీలు స్వీకరించాలంటూ ఆదేశాలు జారీ చేశామన్నారు. కనుక ఎస్సీ,ఎస్టీ అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి నెలలో మొదటి సోమవారం అర్జీలు సమర్పించాలని సూచించారు.

కడప చెస్ క్రీడాకారుడికి అంతర్జాతీయ రేటింగ్



ఎస్. లిఖితేశ్వరరావు

కడప స్పోర్ట్స్: కడప నగరానికి చెందిన ఎస్.లిఖితేశ్వరరావు చదరంగంలో అంతర్జాతీయ క్లాసికల్ ఫిడే రేటింగ్ సాధించాడు. రైల్వే ఉద్యోగిగా పని చేస్తున్న ఎస్.పరమేశ్వరరావు, భాగ్య దంపతుల కుమారుడైన ఈయన గతేడాది నుంచి చదరంగం శిక్షకుడు అనీస్‌దర్బారీ వద్ద శిక్షణ పొందుతున్నాడు. మార్చి 23 నుంచి 30వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్స్ చదరంగం టోర్నమెంట్‌లో ముగ్గురు అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారులపై గెలుపొందడంతో పాటు మరో ఇద్దరు అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారుల మీద మ్యాచ్‌లను డ్రా చేసుకున్నాడు. జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్‌దర్బారీ అభినందించారు.

ఆత్మరక్షణ విద్యలకు పెరుగుతున్న ఆదరణ



తైక్వాండో శిక్షణను ప్రారంభిస్తున్న అతిథులు



సాధన చేస్తున్న బాలలు

- వైఎస్ఆర్ క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామొహిద్దీన్
- సాక్షి మీడియా ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

కడప స్పోర్ట్స్: ఆత్మరక్షణ విద్యలకు ఆదరణ పెరుగుతోందని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్.బాషామొహిద్దీన్ పేర్కొన్నారు. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో కడప నగరంలోని గాంధీనగర్ నగరపాలకోన్నత పాఠశాల క్రీడామైదానంలో తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఎన్నో ఉపయోగకరమైన కార్యక్రమాలు చేపడుతున్న సాక్షి మీడియా వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు వేసవి సెలవులను సమ్మర్ కోచింగ్ క్యాంపుల్లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఫిజికల్ యాక్టివిటీస్ అవశ్యకత ఎంతో ఉందన్నారు. తైక్వాండో సాధన చేయడం ద్వారా చురుగ్గా ఉండవచ్చన్నారు. వేసవి శిక్షణ తర్వాత కూడా క్రీడను బాగా సాధన చేసి జాతీయస్థాయిలో రాణించేలా శ్రమించాలని సూచించారు. మార్షల్ ఆర్ట్స్ శిక్షకులు మాస్టర్ కొన్నిపాటి వెంకటేష్ , మాస్టర్ సి.దామోదర్‌రాజు మాట్లాడుతూ మార్షల్‌ఆర్ట్స్ సాధన చేయడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. క్రమశిక్షణ, అంకితభావంతో ప్రతిరోజూ సాధన చేస్తే ఉత్తమ క్రీడాకారులుగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సాక్షి ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్.ముజీబుద్దీన్, స్టాఫ్ రిపోర్టర్ బి.వి.నాగిరెడ్డి, తైక్వాండో శిక్షకులు గోవర్ధన్‌రావు, ఫాజిల్‌బాషా, మహేష్‌బాబు, రేవంత్‌రెడ్డి, కృష్ణవంశీగౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా ప్రగతిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం ఎంతైనా అవసరమని జేసీ గణేష్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో ఆయన వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను డిసెంబరు 31 నాటికి రూ. 10,682.72 కోట్ల లక్ష్యానికి రూ. 16075.44 కోట్ల రుణాలు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలు, ఎస్ఎంఈ సెక్టార్, ప్రాధాన్య, ప్రాధ్యానేతర రంగాలకు రుణ మంజూరులో బ్యాంకర్లు పురోగమనంలో ఉండడం మంచి పరిణామమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు తోడ్పాటు అందించాలని కోరారు. సచివాలయాలు, ఆర్బీకేల పరిధిలో బ్యాంకింగ్ కరస్పాండెంట్ల సేవలను విస్తృతం చేయాలన్నారు. ప్రత్యేక క్యాంపులు నిర్వహించి పొదుపు ఖాతాల నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. స్టాండప్ ఇండియా పథకానికి అన్ని బ్యాంకులు ఎంటర్ ప్రెన్యూర్‌లకు రుణాలు అందించాలని, అలాగే రికవరీ కూడా సక్రమంగా చేపట్టాలని సూచించారు. యువ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. ముద్ర, పీఎం స్వనిధి వంటి పథకాలతోపాటు పంట రుణాలు, విద్యా రుణాలు, లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డి, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

మదనపల్లె నుంచి ఊటీకి ఆర్టీసీ సర్వీసు

రాయచోటి అర్బన్: వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని మదనపల్లె నుంచి ఊటీ, కూనూరు, మెట్టుపాళెం ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసును నడపనున్నట్లు మదనపల్లె – 2 డిపో మేనేజర్ ఆర్.సి. నిరంజన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులకు అనుకూలంగా ఉండేలా ఈనెల 12వ తేదీ శుక్రవారం రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. 13వ తేదీ తెల్లవారుజామున ఊటీకి చేరుకుంటుందన్నారు. అక్కడ నుంచి కూనూరు హిల్‌స్టేషన్, 14న మెట్టుపాళెంలో ఉండి అదే రోజు రాత్రి బయలుదేరి 15వ తేదీ తెల్లవారుజామున మదనపల్లెకు చేరుకుంటుందన్నారు.

వైవీయూ వైస్ చాన్సలర్‌గా ఆచార్య చింతా సుధాకర్

నేడు బాధ్యతల స్వీకరణ



ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం నూతన వైస్ చాన్సలర్‌గా ఆచార్య చింతా సుధాకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జీఓ నెంబర్ 14ను జారీచేసింది. జనవరి 7న ఆచార్య మునగల సూర్యకళావతి పదవీ కాలం పూర్తి కావడంతో అప్పటి నుంచి జేఎన్‌టీయూ వీసీ ఆచార్య జింక రంగజనార్ధన ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా ప్రభుత్వం బుధవారం ఎస్కేయూ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ చింతా సుధాకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకాలోని గొట్లూరు ఈయన స్వగ్రామం. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో సుదీర్ఘకాలం ఆచార్యులుగా పనిచేశారు. 38 సంవత్సరాల పరిశోధన, 34 సంవత్సరాల బోధన అనుభవం కలిగిన విశ్రాంత వృక్షశాస్త్ర ఆచార్యులు. 2014లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఏపీ అకాడమీ ఆఫ్ సైన్స్‌ఫెలోగా బాధ్యతలు నిర్వహించారు. ఈయన మార్గదర్శనంలో 15 ఎంఫిల్‌లు, 26 పీహెచ్‌డీలు ప్రదానం చేశారు. మరో నలుగురు ఆయన మార్గదర్శనంలో పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఈయన వద్ద పరిశోధనలు చేసిన పలువురు విద్యార్థులు ఇజ్రాయిల్, జర్మనీ, దక్షిణకొరియా, చైనా, యూఎస్ఏ, ఫిలిప్పీన్ వంటి దేశాల్లో శాస్త్రవేత్తలుగా, అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.

కుటుంబ నేపథ్యం.. విద్య, ఉద్యోగం..

పెద్ద వెంకటస్వామి, సాలమ్మ దంపతులకు నాల్గవ సంతానంగా పుట్టిన ఈయన గొట్లూరులో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించారు. ఇంటర్మీడియట్ గుంతకల్‌లోను, అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ పూర్తిచేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వృక్షశాస్త్ర విభాగం నుంచి ఎంఎస్సీ బయోసైన్సెస్ పూర్తి చేశారు. అనంతరం ఆచార్య కె. వీరాంజనేయులు వద్ద పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొందారు. ఈయన సతీమణి బి. ప్రభావతి అనంతపురం జిల్లా కందుకూరులోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు. సౌజన్య, శ్రవణ్‌కుమార్‌లు వీరి సంతానం.

- అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 1987లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 1998లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2004లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. బీఓఎస్ చైర్మన్‌గా, రీసెర్చ్ విభాగం డీన్‌గా, సీడీసీ డీన్, అడ్మిషన్స్ డైరెక్టర్, వార్డెన్, పరీక్షల నియంత్రణాధికారి ఇలా పలు బాధ్యతలు నిర్వహించారు. ఈయన గొప్ప పరిశోధకుడుగా పేరుగాంచారు. ఈయన రాసిన సిద్ధాంతాలు 24 జాతీయ, 62 అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈయన పలు జాతీయ సైన్స్ కమిటీల్లో సభ్యులుగా ఉన్నారు. పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు, ప్రోగ్రాంలు నిర్వహించారు. విదేశాల్లో గెస్ట్ సైంటిస్ట్ గా వ్యవహరించారు. కాగా నూతన వీసీగా నియమితులైన ఆచార్య చింతా సుధాకర్ గురువారం విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు.

వినతులకు నాణ్యమైన పరిష్కారం

- సివిల్ తగాదాలు కోర్టుల్లోనే
- జిల్లా ఆడిట్ టీమ్, పీఎంయూల ఏర్పాటు
- సచివాలయాల్లో మండల స్థాయి స్పందన
- నాలుగేళ్లలో 98.07 శాతం అర్జీల పరిష్కారం
- కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా వినతులను సకాలంలో నాణ్యంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం'(జేకేసీ) కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఇది స్పందనకు మెరుగైన రూపమని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. బుధవారం కలెక్టరేట్ స్పందన హాలులో ఎస్పీ అన్బురాజన్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జేకేసీలో సమర్పించే ప్రతి వినతికి ఒక ఐడీ నెంబరు కేటాయించడంతోపాటు అర్జీ పరిష్కారం ఏ దశలో ఉందో ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు సంక్షిప్త సమాచారం ద్వారా తెలియజేస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, విద్యా దీవెన, అమ్మ ఒడి, కల్యాణమస్తు తదితర సంక్షేమ పథకాలు అర్హత ఉన్నా అందకపోతే టోల్ ఫ్రీ నంబరు 1902కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే రేషన్‌కార్డు, ఆధార్, ఆరోగ్యశ్రీ, రెవెన్యూ పరమైన ప్రభుత్వ సేవలకు కూడా టోల్ ఫ్రీ ద్వారా వినతులు పంపవచ్చన్నారు. సీఎంఓ పర్యవేక్షణలో కార్యక్రమం నడుస్తుందన్నారు. ప్రైవేటు భూముల టైటిల్ విషయంలో అన్నదమ్ముల మధ్య తలెత్తే సివిల్ తగాదాలు కోర్టుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సేవలను షార్ట్ అవుట్ చేయగలిగితే సివిల్ తగాదాలపై ఫిర్యాదులు తగ్గుతాయని, జిల్లా న్యాయమూర్తితో ఈ అంశంపై చర్చిస్తామన్నారు.

జిల్లా ఆడిట్ టీం

ఫిర్యాదుల పర్యవేక్షణ, విశ్లేషణతోపాటు ప్రతి 15 రోజులకు ఒకసారి కలెక్టర్, ఎస్పీలకు నివేదికలు అందించడానికి జిల్లా ఆడిట్ టీం ఏర్పాటు చేశామని చెప్పారు. జెడ్పీ సీఈఓ, సీపీఓ, కలెక్టరేట్‌లోని కేఆర్ఆర్సీ విభాగపు ఎస్‌డీసీ, వల్లూరు ఈఓఅండ్‌ఆర్‌డీ, కలెక్టరేట్‌లోని మీ–సేవ డీటీ, మెడికల్ అధికారి ఈ టీములో ఉంటారని వివరించారు. ఏదైనా సమస్యను అధికారులు సక్రమంగా పరిష్కరించకపోతే ఆడిట్ టీమ్ దాన్ని రీ ఓపెన్ చేస్తుందన్నారు. డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, డీఎస్పీ, అగ్రికల్చర్ ఏడీ, డీఎల్‌డీఓ, మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఎస్‌హెచ్ఓ, వ్యవసాయాధికారి, మెడికల్ అధికారితో కూడిన పర్యవేక్షణ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు చేశామని తెలిపారు.

98.07 శాతం పరిష్కారం

గత నాలుగేళ్లలో స్పందన కార్యక్రమంలో 42,433 అర్జీలు రాగా, 41,616 (98.07 శాతం) పరిష్కరించామని కలెక్టర్ పేర్కొన్నారు. ఇకపై మండల స్థాయిలో నిర్వహించే స్పందన కార్యక్రమాలను ఒక్కో వారం ఒక్కో గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తామన్నారు.

పటిష్ట అమలుకు చర్యలు – ఎస్పీ అన్బురాజన్

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఈ సందర్భంగా అన్నారు. ప్రస్తుతం పోలీసుశాఖకు సంబంధించి రీ ఓపెన్ అయిన 36 పిటీషన్లు, సోమవారం స్పందనలో వచ్చిన 200 అర్జీలను జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి బదలాయిస్తామన్నారు. తమకు వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ, న్యాయ శాఖల సమన్వయంతో నాణ్యంగా పరిష్కరిస్తామని చెప్పారు. టోల్ ఫ్రీ నంబరుపై విస్తృత ప్రచారం చేపడతామన్నారు. ఈ సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కడప అగ్రికల్చర్ : జిల్లాకు సంబంధించి బిందు, తుంపర సేద్య పరికరాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్బీకే) పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా సూక్ష్మ నీటి పారుదల అధికారి ఎం.రవీంద్రనాథరెడ్డి తెలిపారు. జిల్లాకు 2023–24 సంవ్సరానికి 10,500 హెక్టార్లకు పరికరాలను అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పరికరాలు కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుబుక్, వన్బీ, ఎఫ్ఎంబీ, పొలం చెక్ బందీ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాస్పోర్టు సైజుఫొటో, బ్యాంకు అకౌంట్ పాస్బుక్ జిరాక్సులతో ఆర్బీకేల్లోని హార్టికల్చర్, అగ్రికల్చర్, సెరికల్చర్ విలేజ్ అసిస్టెంట్లకు అందించాలన్నారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు..

కడప రూరల్ : జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య తెలిపారు. పూర్వం వైఎస్సార్ జిల్లాకు సంబంధించి ఇంగ్లీషు మీడియంలో 2023–24 విద్యా సంవత్సరానికి మూడో తరగతిలో అన్ని వర్గాలకు ప్రవేశం కలదన్నారు. అలాగే 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు కేవలం గిరిజన విద్యార్థులకు మాత్రమే బ్యాక్లాగ్ సీట్లు ప్రవేశానికి అర్హులైన బాల బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కడప బాలికలు, కడప, పులివెందుల, మైదుకూరు, సుండుపల్లె, రాయచోటి, పోరుమామిళ్లలోని బాలుర గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పూర్తి వివరాలకు సంప్రదించవచ్చన్నారు. ఆసక్తిగల వారు మొత్తం ఏడు గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈనెల 11 నుంచి 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఖాళీల కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే జూన్ 10వ తేదీన కడపలోని గిరిజన సంక్షేమ కార్యాలయంలో విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

12న పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

కడప అగ్రికల్చర్ : కడప ఊటుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) లో ఈనెల 12న పుట్టగొడుగుల పెంపకంపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఆసక్తిగల రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

12న జాబ్మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఈనెల 12న శుక్రవారం ఉదయం 10 గంటలకు నిరుద్యోగ యువతకు జాబ్మేళా నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారి దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఐసీలో రూరల్ కెరీర్ ఏజెన్స్, సిటీ కెరీర్ ఏజెన్స్ కోసం నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్సైట్లో పరిశీలించి తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99083 69666 నంబర్లో సంప్రదించాలన్నారు.

బైక్ ఢీ : మహిళకు గాయాలు

చాపాడు : మండలంలోని సిద్ధారెడ్డిపల్లెలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఉపాధి కూలి సుబ్బమ్మ తీవ్రంగా గాయపడింది. సుబ్బమ్మ గ్రామ సమీపంలోని కడప–కర్నూలు హైవే వద్ద పూడికతీత పనులకు వెళ్లింది. రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొంది.ఈ సంఘటనలో ఆమెకు, ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని మైదుకూరు ఆసుపత్రికి తరలించారు.

జనసంద్రం..రథోత్సవం

పురవీధుల్లో ఊరేగిన నారాపుర వేంకటేశ్వరస్వామి

జమ్మలమడుగు : శ్రీనారాపుర వెంకటేశ్వర స్వామి రథోత్సవంవైభవంగా నిర్వహించారు. రెండు సంవత్సరాలుగా పట్టణంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుగకపోవడంతో ఈ ఏడాది స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామివారికి తిరుమల తిరుపతికి దేవస్థానానికి చెందిన వేదపండితులు, స్థానిక అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో శ్రీదేవి, భూదేవి సతీసమేతుడైన వెంకటేశ్వరస్వామిని కొలువుదీర్చారు. ఉదయం 9.30 గంటలకు రథాన్ని భక్తులు కదిలించారు. ఆలయం వద్ద నుంచి తేరు పెద్ద పసుపల రహదారి, సంజామలమోటు, స్టేట్బ్యాంక్ రోడ్డు తహసీల్దార్ కార్యాలయం ,పాతబస్టాండ్ మీదుగా మార్కెట్ వీధి గుండా ఆంజనేయస్వామి ఆలయం వద్దకు మధ్యాహ్నం చేరుకుంది. సాయంత్రం రథం మెయిన్బజార్ మీదుగా కన్యకాపరమేశ్వరి, అంబభవాని ఆలయం మీదుగా యథాస్థానానికి చేరుకుంది. నారాపుర వెంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని వీక్షించటానికి వివిధ గ్రామాలనుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో పురవీధులు భక్తులతో





రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్సెట్) హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్రెడ్డి

కిటకిటలాడాయి. భక్తులకు ట్రస్టులు, స్వచ్ఛంధ సంస్థలు చల్లటి పానీయాలు అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్రెడ్డి

ఎమ్మెల్యే మూలె సుధీర్రెడ్డి ఆలయానికి వచ్చారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అర్చకులు పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బడిగించల విజయలక్ష్మి, చైర్పర్సన్ వేల్పుల శివమ్మ, టీడీపీ ఇన్చార్జి భూపేష్రెడ్డి ఉన్నారు.

పది సప్లిమెంటరీలో శతశాతంఉత్తీర్ణత సాధించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా జూన్ 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరిగే పది సప్లిమెంటరీ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతను సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్రెడ్డిలు ఆదేశించారు. బుధవారం కడప కలెక్టరేట్లోని సభాభవనంలో డీఈఓ ఆధ్వర్యంలో జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతిలో 5500 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరక్షలు రాయనున్నారన్నారు. ఇందులో ఎక్కువ మంది ఒకటి లేదా రెండు సబ్జెక్టులు తప్పారన్నారు. వీరి కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.అందువల్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థి పరిస్థితిని బట్టి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, ప్రతి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

ఒక్కరూ ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలన్నారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారులందరూ తమ మండలాల పరిధిలో ఉన్న పాఠశాలల్లో ప్రతి రోజు రెమడియల్ క్లాసులను నిర్వహించేలా ప్రధానోపాధ్యాయులకు కమ్యూనికేట్ చేయాలన్నారు. ఈ విషయంలో ఎంఈఓలు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఏడీ చెప్పలి దేవరాజు, డిప్యూటీ ఈఓ రాజగోపాల్రెడ్డి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ-స్టాపింగ్ అయినా చట్టబద్ధమే

కడప కోటిరెడ్డిసర్కిల్ : అఫిడవిట్లకు, అగ్రిమెంట్లకు, దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు ప్రజలు సంప్రదాయకంగా నాన్ జ్యుడిషియల్ స్టాంపులు వాడటం పరిపాటి. నాన్ జ్యుడిషియల్ స్టాంప్కు సమాంతరంగా స్టాక్ హోల్డ్ కార్పొరేషన్ వారితో ఈ–స్టాంపింగ్ విధానాన్ని ఇటీవలే ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని, దాని ద్వారా నాన్ జ్యుడిషియల్ స్టాంపులను పొందవచ్చని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ శివరాం తెలిపారు. ఈ–స్టాపింగ్ ద్వారా వేసిన స్టాంపులు నాన్ జ్యుడిషియల్ బాండ్పేపర్లతో సమానంగా చెలామణి అవుతాయన్నారు. వీటిని దస్తావేజుల రిజిస్ట్రేషన్ నిమిత్తం కూడా నిరభ్యంతరంగా వాడుకోవచ్చన్నారు. ఈ–స్టాపింగ్ ద్వారా స్టాంపుల అమ్మకం, లైసెన్స్ కొరకు ప్రజలు దరఖాస్తు చేసుకుంటే స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ వారు సత్వరమే లైసెన్సులను మంజూరు చేస్తున్నారన్నారు. పైగా దస్తావేజులను నాన్ జ్యుడిషియల్ స్టాంపుల మీద రాసుకున్న ఈ–స్టాపింగ్ ద్వారా ముద్రలు పొందినా రిజిస్ట్రేషన్కు అనుమతించేలా సబ్ రిజిస్ట్రార్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. తమ సమీపంలోని ఈ–స్టాపింగ్ కేంద్రాల లైసెన్స్ వెండర్ల అందుబాటులోని వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.రిజిస్ట్రేషన్.ఏపీ.జీఓవీ.ఇన్ లేదా హెచ్టీపీపీ:://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్హెచ్సీఐఎల్ఈ స్టాంప్.కామ్ వెబ్సైట్లలో తెలుసుకోవచ్చన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : జేఎన్టీయూ (అనంతపురం) బీటెక్ నాల్గో సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్ (ఆర్–19), సప్లిమెంటరీ (ఆర్–15) పరీక్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన బుధవారం విడుదల చేశారు. రెగ్యులర్ పరీక్షలకు 14,508 మంది విద్యార్థులు హాజరుకాగా.. 13,317 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పరీక్ష ఫలితాలకు సంబంధించి రీకౌంటింగ్ ఫొటో కాపీ, చాలెంజ్ వాల్యూయేషన్ నోటిఫికేషన్ జారీ చేస్తున్నామని, గురువారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని వైస్ చాన్సలర్ సూచించారు. అలాగే ఈ నెల 25 నుంచి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను కూడా ఈ సందర్భంగా విడుదల చేశారు.రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, డీఏపీ ప్రొఫెసర్ వి.సుమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతం.. తీసింది ప్రాణం

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

వేముల : వేములకు చెందిన దుద్దేకుంట ప్రతాప్రెడ్డి (42) విద్యుత్ షాక్తో మృతి చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతాప్రెడ్డి గత 12ఏళ్లుగా వేముల విద్యుత్ సబ్స్టేషన్లో ఆపరేటర్గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం విధులు లేకపోవడంతో రాచకుంటపల్లెకు చెందిన ఎర్రగోలు సాంబశివుడు ట్రాన్స్ఫార్మర్లో ఫీజులు వేయాలని ప్రతాప్రెడ్డిని పిలిచాడు. దీంతో ఉదయం 9 గంటల ప్రాంతంలో ప్రతాప్రెడ్డి రాచకుంటపల్లెకు వెళ్లాడు. అక్కడ ట్రాన్స్ఫార్మర్కు ఫీజులు వేస్తుండగా విద్యుత్ షాక్కు గురయ్యాడు. దీంతో అక్కడ ఉన్న వారు చికిత్స నిమిత్తం పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రతాప్రెడ్డి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనకు సంబంధించి మృతుడి భార్య లక్ష్మిదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్చార్జి ఎస్ఐ రంగారావు తెలిపారు. ప్రతాప్రెడ్డి కుటుంబ సభ్యులను పులివెందుల ఏరియా ఆసుపత్రిలో వైఎస్సార్సీపీ మండల ఇన్చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకట





ప్రతాప్రెడ్డి, సోమిరెడ్డిల మృతదేహాలు

బయపురెడ్డి, వైఎస్సార్ సీపీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి పరామర్శించారు.

పొలంలో గడ్డి తొలగిస్తూ..

తొండూరు : మండలంలోని భద్రంపల్లె గ్రామానికి చెందిన కర్నాటి సోమిరెడ్డి(55) అనే రైతు విద్యుత్ షాక్తో మృతి చెందాడు. బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రోజు మాదిరిగా సోమిరెడ్డి తన పొలానికి వెళ్లాడు. పచ్చ గడ్డిని తొలగిస్తుండగా అక్కడే ఉన్న విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో విద్యుత్ షాక్కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఉత్తమ్మ, కుమారులు సోమశేఖరరెడ్డి, సోమేశ్వరరెడ్డి ఉన్నారు. సోమిరెడ్డి మృతదేహాన్ని పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

- బుకీతోపాటు మరో ఇద్దరు అరెస్టు
- రూ. 41,000 నగదు, సెల్ఫోన్ స్వాధీనం



క్రికెట్ బుకీల అరెస్ట్ వివరాలను తెలుపుతున్న కడప డీఎస్పీ షరీఫ్

కడప అర్బన్ : ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నేపథ్యంలో క్రికెట్ బుకీలపై పోలీసులు నిఘా ఉంచారు. ఈక్రమంలో తమకు వచ్చిన సమాచారంతో కడప రూరల్ సీఐ కె. అశోక్రెడ్డి ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నె ఎస్ఐ బి. అరుణ్రెడ్డి ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 41000 నగదు, సెల్ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. కడపలోని డీఎస్పీ కార్యాలయంలో కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్ ఈ సంఘటన వివరాలను వెల్లడించారు. అరెస్టయిన వారిలో చింతక్కొదిన్నె మండలం బొడెద్దుల పల్లె గ్రామానికి చెందిన షేక్ హకీం సాబ్ అనే క్రికెట్ బుకీతో పాటు జాకీర్ హుసేన్, లారీ మాబాషా ఉన్నారు. ఈనెల 9వ తేదీ రాత్రి బోడెద్దులపల్లి గ్రామంలోని మసీదు సమీపంలో షేక్ హకీం సాబ్, హర్షలు సెల్ఫోన్లలో క్రికెట్ బెట్టింగ్ అనే జూదం ఆడుతుండగా, కొత్తపల్లికి చెందిన హర్ష పారిపోయాడు. అరెస్టయిన షేక్ హకీం సాబ్ను పోలీసులు విచారణ చేశారు. ఈ విచారణలో అతని మూడో అన్న హీరాపీరా, అదే గ్రామానికి చెందిన యాసిన్, షేక్ షఫీ అనే వారు కూడా కువైట్లో ఉంటూ ఐపీఎల్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హీరా పీరా, యాసిన్ ప్రధాన బుకీలుగా ఉంటూ ఆర్కెభ వ్స్పింటర్స్ (కింగ్ ఆఫ్ ఆన్లైన్ గేమ్స్), మహదేవ్ బుక్(రోడ్ కింగ్ ఆఫ్ ఆన్లైన్ వరల్డ్), క్రికెట్ ఎక్స్చేంజ్, క్రికెట్ ఎక్స్చేంజ్ ఫాంటసీ, ఐసీ ఎక్స్చేంజ్ వంటి ఆన్లైన్ యాప్ల ద్వారా చింతకొమ్మదిన్నె మండలం బోడెద్దుల పల్లి గ్రామానికి చెందిన యువకులకు లింక్లు పంపుతూ క్రికెట్ బెట్టింగ్ ఆడిస్తూ ఉన్నారు. షేక్ హకీం సాబ్, జాకీర్ హుసేన్, లారీ మాబాషా, ఇర్ఫాన్, ఇంకా కొంతమంది కలిసి హీరా పీరా, యాసిన్, షేక్ షఫీలు చెప్పిన విధంగా బోడెద్దుల పల్లి గ్రామంలో క్రికెట్ బెట్టింగ్ ఆడేవారి వద్ద నుంచి డబ్బులను వసూలు చేస్తారు. వాటిని కువైట్లో ఉన్న హీరా పీరా, యాసిన్, షేక్ షఫీల అకౌంట్లకు పంపుతూ ఉండేవారని తెలిసింది.ఈనెల 9వ తేదీ రాత్రి రాయల్ ఛాలెంజర్స్, బెంగుళూరు– ముంబై ఇండియన్స్ మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో షేక్ హకీం సాబ్ను పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ. 41,000 నగదు, ఒక అండ్రాయిడ్ మొబైల్ ఫోన్ను సీజ్ చేశారు. కువైట్లో ఉన్న హీరా పీరా, యాసిన్, షేక్ షఫీలు క్రికెట్ బెట్టింగ్కు వాడిన బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ చేసి,వారి కోసం లుకౌట్ నోటీసులు ఏర్పాటు చేసి ఎంబసీ వారికి పంపి అరెస్ట్ చేస్తామని డీఎస్పీ చెప్పారు. చింతకొమ్మదిన్నె మండలం పరిధిలో ఉంటూ క్రికెట్ బెట్టింగ్కు పాల్పడిన హర్ష, ఇర్ఫాన్లను కోసం ప్రత్యేక పోలీసు బృందం గాలింపు చర్యలు చేపట్టిందని, వారిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్కు పాల్పడుతున్న వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలనీ డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో కడప రూరల్ సీఐ కె. అశోక్రెడ్డి, ఎస్ఐ అరుణ్రెడ్డి సిబ్బందిని కడప డిఎస్పీ అభినందించారు.

సీపెట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్ : భారత ప్రభుత్వ సంస్థ విజయవాడలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ వారు 2023–24 విద్యా సంవత్సరానికిగాను డిప్లొమా, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులకు విద్యార్థుల నుంచి www.ci pet.gov.in ఆన్లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. 3 సంవత్సరాల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సులకు 10వ తరగతి పాసైన వారు, 2 సంవత్సరాల వ్యవధిగల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెస్సింగ్, టెస్టింగ్ కోర్సుకు బీఎస్సీ పాసైనవారు, ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 250, ఓబీసీ, జనరల్ విద్యార్థులు రూ. 500 ఆన్లైన్లో ఈ నెల 28వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 11వ తేదీ సీపెట్ అడ్మిషన్ టెస్టు ఆన్లైన్లో జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 6300147965 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

పాఠశాల తెరిచిన రోజే జగనన్న విద్యా కానుక

చింతకొమ్మదిన్నె : విద్యార్థులకు పాఠశాల తెరిచిన రోజే జగనన్న విద్యా కానుక అందజేస్తామని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్రెడ్డి తెలిపారు. బుధవారం సీకే దిన్నె జిల్లా పరిషత్ హైస్కూలులోని జగనన్న విద్యాకానుక మండల స్టాక్ పాయింట్ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థులకు ఇవ్వబోయే యూనిఫాం, బ్యాగు, బెల్ట్, షూ పరిశీలించి నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 1,58,157 మంది విద్యార్థులకు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాల తెరిచిన రోజే విద్యా కానుక కిట్లు ఇచ్చేందుకు ముందస్తు



జగనన్న విద్యాకానుక మండల స్టాక్ పాయింట్ను పరిశీలిస్తున్న అంబవరం ప్రభాకర్రెడ్డి

ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వెంకట్రామిరెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి దశరథరామిరెడ్డి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం : బంగారు వ్యాపారిపై పోక్సో కేసు

ప్రొద్దుటూరు క్రైం : మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో సుబ్బారావు అనే బంగారు వ్యాపారిపై పోక్సో యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

వన్టౌన్ పోలీసుల కథనం మేరకు పట్టణంలోని ఓ ప్రాంతానికి చెందిన భార్యాభర్తలకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఇళ్లలో పాచి పనికి వెళ్తుండగా భర్త సప్లయర్ దుకాణంలో పని చేస్తున్నాడు. కుమార్తె 10వ తరగతి చదువుతోంది. కొన్ని రోజుల క్రితం ఆమె సుబ్బారావు అనే బంగారు వ్యాపారి ఇంట్లో పనిలో చేరింది. పట్టణంలోని వరలక్ష్మి అపార్ట్మెంట్స్ సమీపంలో తన ఇల్లు ఖాళీగా ఉందని, తనకు బాడుగ కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని వ్యాపారి చెప్పాడంతో ఆ ఇంట్లో చేరారు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం సుబ్బారావు ఆమె ఇంటికి వెళ్లాడు. ఒంటరిగా ఉన్న బాలిక వద్దకు వెళ్లి అసభ్యకరంగా మాట్లాడుతూ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటన జరిగినా కుమార్తె చదువు దెబ్బతింటుందనే భయంతో భార్యాభర్తలు ఎక్కడా చెప్పలేదు. ఈ విషయం తెలుసుకున్న వ్యాపారి భార్య, బంధువులు బాలిక ఇంటి వద్దకు వెళ్లి ఈ విషయాన్ని తమతో ఎందుకు చెప్పలేదని దుర్భాషలాడారు. వెంటనే ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని బెదిరించడంతో కొన్ని రోజుల క్రితం ఇల్లు ఖాళీ చేసి వారు దొరసానిపల్లెలో చేరారు. వ్యాపారి సుబ్బారావు ప్రవర్తించిన తీరుతో సరిగా చదవలేక బాలిక పదోతరగతి ఫెయిల్ అయింది. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్టౌన్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. వ్యాపారి సుబ్బారావును బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

యువకుడిపై బీరు బాటిల్తో దాడి

మదనపల్లె : యువకుడిపై బీరు బాటిల్తో మరో వ్యక్తి దాడి చేసిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. వివరాలు.. పట్టణంలోని సైదాపేటకు చెందిన యజాజ్ (25) మద్యం తాగేందుకు పట్టణంలోని నక్కలదిన్నె తాండాకు వెళ్లాడు. అక్కడ నక్కలదిన్నెకు చెందిన స్నేహితుడు శ్రీనివాసులుతో కలిసి మద్యం సేవించాడు. అనంతరం ఇద్దరి మధ్య వివాదం తలెత్తి మద్యం మత్తులో గొడవపడ్డారు. ఘర్షణలో శ్రీనివాసులు బీరు బాటిల్తో యజాజ్పై దాడి చేశారు. దాడిలో యజాజ్ తీవ్రంగా గాయపడటంతో స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వన్టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రక్తమోడిన రహదారులు

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదాలతో రహదారులు రక్తమోడాయి. వేర్వేరు సంఘటనల్లో నలుగురు మృతి చెందారు. వైఎస్సార్ జిల్లా బద్వేలులో కారు ఢీకొని ఒకరు, పోరుమామిళ్లలో లారీ ఢీకొని మరొకరు, వల్లూరు మండలంలో టిప్పర్ ఢీకొని గుర్తు తెలియని మహిళ, అన్నమయ్య జిల్లా గుర్రంకొండ టమాటా మార్కెట్ వద్ద జరిగిన ప్రమాదంలో సాఫ్ట్వేర్ ఉద్యోగి మృతి చెందారు.

భోజనానికి ఇంటికి వస్తుండగా..



రామయ్య (ఫైల్)

బద్వేలు అర్బన్ : బద్వేలు – మైదుకూరు రహదారిలోని నందిపల్లె సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మండల పరిధిలోని తిరువెంగళాపురం గ్రామానికి చెందిన మున్నెల్లిరామయ్య అలియాస్ చాకలి రామయ్య (60) బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య పోలమ్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. రోజూ మాదిరే బేల్దారి పని నిమిత్తం నందిపల్లెకు వెళ్లిన రామయ్య మధ్యాహ్నం సమయంలో ఇంటికి భోజనానికి తన ద్విచక్ర వాహనంలో వస్తుండగా బద్వేలు నుండి మైదుకూరు వైపు వెళుతున్న ఓ కారు నందిపల్లె సమీపంలోని సగిలేరు బ్రిడ్జి వద్ద రామయ్యను వేగంగా ఢీకొనింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన రామయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు అర్బన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్ళి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్కు తరలించారు. మృతుడి సోదరుడు రవిశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని..



ఆనంద్ (ఫైల్)

మదనపల్లె : రెండు బైక్లు ఢీకొని సాఫ్ట్వేర్ ఉద్యోగి మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలైన సంఘటన బుధవారం గుర్రంకొండ మండలంలో జరిగింది. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ అగ్గిపెట్టెలకాలనీకి చెందిన పద్మావతి, శంకర్నాయుడుల కుమారుడు బోయపాటి ఆనంద్ (27) ఎంబీఏ పూర్తి చేసి బెంగళూరులో సాఫ్ట్వేరు ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో గుర్రంకొండకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా మదనపల్లె పట్టణం రెడ్డీస్కాలనీకి చెందిన తరుణ్కుమార్రెడ్డి (29) తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె వద్ద కుమ్మరపల్లెకు బంధువుల ఇంటికి వెళ్లాడు. బంధువైన మరో యువకుడు సందీప్ (15)తో కలిసి కుమ్మరపల్లె నుంచి ద్విచక్రవాహనంలో గుర్రంకొండకు బయలుదేరారు. గుర్రంకొండ టమోటా మార్కెట్యార్డు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆనంద్ ద్విచక్రవాహనాన్ని వీరి బైక్ ఢీకొంది. ప్రమాదంలో ఆనంద్ తలకు తీవ్రగాయమైంది. మరో బైక్లో ఉన్న తరుణ్కుమార్రెడ్డి, సందీప్లు కూడా తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆనంద్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన తరుణ్కుమార్రెడ్డిని మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఆనంద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. గుర్రంకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శంకర్నాయుడు, పద్మావతిలకు కుమారుడు ఆనంద్, కుమార్తె కవితలు ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద గుండెలవిసేలా రోదించారు.

లారీ ఢీకొని..



సిద్దయ్య మృతదేహం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల – విజయవాడ రూట్లో నాగలకుంట్ల సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో దాసరి సిద్దయ్య (35) మృతి చెందాడు. ఎస్ఐ హరిప్రసాద్ కథనం మేరకు ద్విచక్రవాహనంలో వస్తున్న సిద్దయ్యను దర్శి నుంచి సరుగుడు కొయ్యలతో హుబ్లీ వెళుతున్న లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్దయ్య ప్రకాశం జిల్లా అద్దంకికి చెందిన వాడని, అతను ఇటు వైపు ఎందుకు వచ్చాడో తెలియదన్నారు. డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టిప్పర్ ఢీకొని..



వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండల పరిధిలోని తొల్లగంగనపల్లె బస్టాపు వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో బుదవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సుమారు 55 సంవత్సరాల వయసు గల మహిళ మృతి చెందింది. ఎస్ఐ పెద్ద ఓబన్న, స్థానికుల కథనం మేరకు రెండు రోజులుగా స్థానికంగా బిక్షాటన చేసుకుంటన్న మహిళ తెల్లవారు జామున రోడ్డు దాటుకుంటుండగా టిప్పర్ ఢీకొంది. దీంతో ఆమె తల నుజ్జు నుజ్జుగా మారి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి సంభందించిన వివరాలు తెలిసిన వారు వల్లూరు పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.